చేతికందని సాయం.. దగాపడ్డ రైతాంగం



నా పేరు గాదిరాజు శ్రీనివాసరాజు. మాది నందలూరు మండలం, ఆడపూరు గ్రామం. నాకు నాలుగు ఎకరాలు పొలం ఉంది. అందులో వరిసాగు చేసి జీవనం సాగిస్తుంటాను. నాకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 13500లు చొప్పున నాలుగు సంవత్సరాలు అందుకున్నాను. నేడు కూటమి ప్రభుత్వం వచ్చి రైతు భరోసాను అన్నదాత సుఖీభవగా మార్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసి నెల రోజులు దాటినా రైతులకు రూ. 20 వేలు సహాయం అందించకపోవడంతో రైతులు పెట్టుబడికి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం డబ్బును రైతుల ఖాతాలలో జమచేసి వ్యవసాయం భారం కాకుండా చేయాలి.



నా పేరు గద్దె రామచంద్రయ్య, మా ఊరు వంతాటిపల్లె, సిద్దవటం మండలం. నాకు గ్రామంలో 1.50 ఎకరాల భూమి ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగు చేశాను. ఎకరాకు రూ. 20వేలు చొప్పున అప్పుచేసి ఖర్చు చేశాను. ఎన్నికల ముందు ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20వేలు ఇస్తామన్నారు. ఏదో ప్రభుత్వం డబ్బులు వేస్తుందిలే అప్పులు లేకుండా సాగు చేసుకోవచ్చనుకున్నాను. ఇప్పటి వరకు ప్రభుత్వం డబ్బు వేయకపోవడంతో పంట సాగుకు అప్పులు చేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద పంట సాగు కోసం సకాలంలో డబ్బు వేయడంతో అప్పులు లేకుండానే వరి పంటను సాగు చేశాను.



ఈయన పేరు గద్దం మోహన్ రెడ్డి. ఈయన ఊరు రవీంద్ర నగర్ కాలనీ, చౌటపల్లి గ్రామం, లక్కిరెడ్డిపల్లి మండలం. ఈయనకు 2.50 ఎకరాలు పొలం ఉంది. ఖరీఫ్ సీజన్ సమయం ముగుస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు అనా పైసా కూడా రైతుకు సాయం చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ మొదలవగానే రైతు భరోసా పథకం ద్వారా ప్రతి సంవత్సరం పెట్టుబడి సాయం అందేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో పంట సాగు చేసుకోవాలంటే అప్పులు తెచ్చుకుని విత్తనాలు సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది ఆవేదన చెందుతున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వం రైతుకు రూ. 20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు అవుతున్నా ఒక రూపాయి కూడా పెట్టుబడి సాయం అందలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియకుండా పోతోందని దీంతో వ్యవసాయానికి అప్పులు చేయాల్సి వస్తోందని చెబుతున్నాడు.



- అన్నదాన సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామని హామీ
- కూటమి ప్రభుత్వం ఏర్పడి 50 రోజులైనా ఊసే లేని సాయం
- గత సర్కారు రైతు భరోసా ద్వారా ఏటా సాయం
- పెట్టుబడి కోసం ఎదురు చేస్తున్న రైతాంగం

సాక్షి, నెట్‌వర్క్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అన్నదాతలకు ఇంత వరకు అన్నదాత సుఖీభవ పథకం మంజూరు కాలేదు.

అసలు ఎప్పుడు ఈ పథకాన్ని వర్తింపజేస్తారో ప్రభుత్వం ప్రకటించలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేకించి రైతుల కోసం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం ద్వారా ఏటా ప్రతి రైతుకు రూ.13,500 చెల్లించేవారు. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటి నుంచి విడతల వారీగా ఈ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసే పరిస్థితి ఉండేది. దీంతో సీజన్ ఆరంభంలో సేద్యపు ఖర్చులు, విత్తనాలు, ఎరువుల కోసం ఈ మొత్తం ఉపయోగపడేది. ఈ ఏడాది ఇప్పటికే ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో వరి పంట సాగు చేశారు. మిగతా పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. మైదుకూరు నియోజకవర్గంలో పసుపు, జొన్న, దోస, పత్తి, వివిధ రకాల కూరగాయలు, బద్వేలు నియోజకవర్గంలో జొన్న, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, సజ్జ, పండ్ల తోటలు, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో శనగ, పత్తి, వరి, వేరుశనగ, నువ్వులు, మినుము తదితర పంటలు సాగు చేయనున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని పేరు మార్చి అన్నదాత సుఖీభవగా నామకరణం చేశారు. ఈ పథకం ద్వారా ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల్లో హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటికే తన వాటాను చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు రైతులకు జమ చేయలేదు. అసలు ఎప్పుడు ఇస్తారు అన్న విషయంపై రైతుల్లో అయోమయం నెలకొంది.

2019 - 2024 వరకు వైఎస్సార్ రైతు భరోసా వివరాలు మండలాల వారీగా

మండలం	రైతులు	లబ్ధి రూ. కోట్లల్లో
రైల్వేకోడూరు నియోజకవర్గం		
కోడూరు	5,417	7.31
ఓబులవారిపల్లి	5,872	7.92
పుల్లంపేట	4,857	6.55
చిట్వేలి	5,715	7.71
పెనగలూరు	5,933	8.00
రాయచోటి నియోజకవర్గం		
సంబేపల్లె	7,312	9.87
చిన్నమండెం	5,479	7.39
రాయచోటి	6,486	8.75
గాలివీడు	8,522	11.50
లక్కిరెడ్డిపల్లె	6,113	8.25
రాజంపేట నియోజకవర్గం		
వీరబల్లె	6600	8.91
నందలూరు	3372	4.55
సుండుపల్లె	7482	10.10
ఒంటిమిట్ట	2859	3.86
సిద్దవటం	7300	19.56
రాజంపేట	6610	8.92

రైతు భరోసా ఆదుకునేది



నేను రెండు ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నాను. గత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా పథకం ఖరీఫ్ ఆరంభానికి ముందే బ్యాంకు ఖాతాల్లో నగదు వేసేది. అది ఎంతగానో ఆదుకునేది. ఆ సొమ్ము సాగు చేసేందుకు పెట్టుబడి కింద ఎంతో ఉపయోగపడేది. ఆర్థికంగా ఇబ్బందులు కలుగకుండా రైతులకు వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉండేది. ప్రభుత్వం మారాక ఖరీఫ్ ప్రారంభమై నెల పూర్తయినా ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందలేదు. అప్పులు తెచ్చుకొని వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

– సిద్దారెడ్డి, కేసీ అగ్రహారం, కోడూరు

అన్నదాత సుఖీభవ అందించాలి



నాకు 5 ఎకరాల భూమి ఉంది. అందులో అరటి తోట వేశాను. గత ప్రభుత్వం రైతు భరోసాను పారదర్శకంగా అందించేది. చంద్రబాబు రైతులకు వ్యవసాయం పండుగ చేస్తానని హామీ ఇస్తే ఎంతో సంతోషించాం. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తానంటే ఆనందించాం. తీరా ఖరీఫ్ ఆరంభమైన ఇంత వరకు పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తామనేది కూడా చెప్పడం లేదు. అసలు ఇస్తారో లేదో తెలియకుండా ఉంది. అన్నధాత సుఖీభవ అందించి మా లాంటి రైతులను ఆదుకోవాలి.

– ఎన్ ఎల్లయ్య, రైతు, పుల్లంపేట

గత పాలనలో రెగ్యులర్ పెట్టుబడిసాయం పడేది



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. అరటిసాగు చేసుకుంటున్నాను. గత ఐదేళ్ల పాలనలో రెగ్యులర్‌గా పెట్టుబడిసాయం నా ఖాతాలో పడేది. సాగుకు అవసరాలను తీరేవి. పెద్దగా అప్పు చేయాల్సిన పరిస్థితి లేకపోయా. కూటమి సర్కారు వచ్చి నెల దాటిపోయింది. రైతు గురించి ఆలోచించే పరిస్థితులు కనిపించడంలేదు. ఇప్పుడు అరువు తెచ్చుకొని మందులు కొట్టాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైన ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– కొండూరు విజయలక్ష్మీ, బాలరాచపల్లె, రాజంపేట

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలలి



గత ఎన్నికల సమయంలో టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం బాధకరం. గత వైఎస్ఆర్‌పీపీ ప్రభుత్వం అధికారంలో సీజన్ ప్రారంభంలోనే డా.వైఎస్సార్ రైతు భరోసా డబ్బులు నేరుగా ఖాతాలో పడేది. ఈ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభమైన డబ్బులు వేయలేదు. అప్పులు చేసి వ్యవసాయం చేయడం రైతుకు మంచిది కాదు. ప్రభుత్వం ఇప్పటికైనా వ్యవసాయం పెట్టుబడి కింద నగదు విడుదల చేసి మాట నిలబెట్టుకోవాలి.

– శివయ్య,రైతు, శెట్టిపల్లె, సంబేపల్లె

సాగుకు సాయం ఏది?



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు 40 రోజులకు పైగా కావస్తున్న పంటల సాగుకు సంబంధించి ప్రభుత్వం సాయం ఇంతవరకు అందలేదు. గత ప్రభుత్వంలో ఈపాటికే రైతు భరోసా కింద రైతులకు పంటసాగుకు ఆర్థిక సాయం అందేది. విత్తనాలు, ఎరువులు, సేద్యాలు అన్ని సమస్యగా దాపరించాయి. వీటికి తోడు ప్రభుత్వ సాయానికై ఎదురుచూడాల్సి ఉంది. ఐదు ఎకరాలు ఉన్న సాగు ఎలా చేయాలనే ఆలోచనలో రైతులు ఉన్నారు. అప్పులు చేస్తే తీర్చే పరిస్థితి ఇప్పుడు లేదు. వ్యవసాయం పండుగ చేస్తానన్న సీఎం చంద్రబాబు ఆ మాట ప్రకారం రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేల నగదును అందించాలి.

– అయూబ్‌ఖాన్, నీలకంఠ్రావుపేట, రామాపురం

ప్రభుత్వం నుంచి అందని సహాయం



వర్షాలు కురవడంతో పొలాలకు పదునైంది. ఓ ప్రక్క మోటార్ల కింద వరిపొలాలు నాటుకుంటూ సజ్జా, మామిడి తోటల దున్నకాలు ముమ్మరంగా చేపడుతున్నాం. గత ప్రభుత్వంలో మే నెల నాటికే రైతు భరోసా కింద ప్రభుత్వం రైతులకు సహాయం చేసేది. ప్రస్తుతం జూలై వస్తున్నా ప్రభుత్వం నుంచి ఇంత వరకు రూపాయి కూడా అందలేదు. దీని కారణంగా అప్పులు చేసి పెట్టుబడి పెడుతున్నాం. ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు కావస్తున్నా రైతులకు మాత్రం సహాయం అందించడం లేదు. ప్రభుత్వం సహాయం అందిస్తే రైతులను ఆదుకున్నవారవుతారు.

– శ్రీనివాసులు రెడ్డి, రైతు, నాగిరెడ్డిపల్లి, పెనగలూరు మండలం

క్లుప్తంగా

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

పుల్లంపేట : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణమూర్తి కోరారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఈఓకు వినతి పత్రం సమర్పించారు. జీఓ నెంబరు – 117ను రద్దు చేసి జీఓ నెంబరు – 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాలలో నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. హైస్కూల్‌లో సమాంతరంగా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో శంకరయ్య, వరదారెడ్డి, శ్రీనివాస్, ఖాదర్ బాషా, నారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ మేడా ఆర్థిక సహాయం

రాజంపేట టౌన్ : ఈ ఏడాది మేలో రాజంపేట పట్టణం నూనెవారిపల్లెకు చెందిన ఏనుగుల హరీష్ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మృతునిది పేద కుటుంబం కావడంతో విషయాన్ని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రూ.లక్ష ఆర్థిక సహాయం చేసినట్లు కౌన్సిలర్ కూండ్ల రమణారెడ్డి మంగళవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. నగదును ఎంపీ రఘునాథరెడ్డి నేరుగా మృతుని భార్య మొలకల లక్ష్మీదేవి బ్యాంక్ ఖాతాకు పంపారన్నారు. మృతునికి చిన్నపిల్లలు ఉండటం, దీనికితోడు వలంటీర్‌గా ఉన్న లక్ష్మీదేవికి ఇప్పుడు ఆ ఉద్యోగం కూడా లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులను మేడా రఘునాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన ఆర్థిక సహాయం చేశారన్నారు.

సూచిక బోర్డుల ఏర్పాటు

సంబేపల్లె : రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల వ్యాప్తంగా ఉన్న ప్రమాద ప్రాంతాలను గుర్తించి పోలీస్ సిబ్బంది సాయంతో సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ప్రత్యేకంగా చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై మోటకట్ల, నారాయణరెడ్డిపల్లె, పీఎస్‌కాలనీ, సంబేపల్లె, దేవపట్ల, గుట్టపల్లె ప్రాంతాలలో ఈ బోర్డులు ఏర్పాటు చేశారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యత

రాయచోటి అర్బన్ : పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ కమిషన్ వాసుబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు రాహుల్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం వారు పట్టణంలోని 6, 9 వార్డులలో పర్యటించారు. ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు వార్డులలో నిరుపయోగంగా, రిపేర్ల పాలైన మినీవాటర్ స్కీంల బోర్లకు వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు నీటినందించేలా చర్యలు తీసుకోవాలంటూ కోరారు. మురుగునీటి కాలువలను నిరతంరం శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జునతో ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం

పెనగలూరు : చక్రంపేట హైస్కూల్‌లో మంగళవారం పండ్ల మొక్కలను ఎంఈఓ సుబ్బరాయుడు విద్యార్థులతో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటినట్‌లైతే ఆ పాఠశాల పచ్చని చెట్లతో కళకళలాడుతుందని తెలిపారు. విద్యార్థులు లోకేష్, మణికంఠ పుట్టినరోజు సందర్భంగా పండ్ల మొక్కలు నాటారు.

గ్రామాల్లో పరిశుభ్రతను పాటించాలి

గాలివీడు : గ్రామాల్లో పరిశుభ్రతను పాటించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ఈఓపీఆర్‌డీ శేఖర్ నాయక్ గ్రామ సర్పంచ్‌లకు, సచివాలయం సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో 2024 – 25కు సంబంధించిన నిధులను ప్రణాళిక బద్ధంగా వాడుకోవాలని, ప్రజ ఆరోగ్య యాప్‌లో ఎప్పటికప్పుడు గ్రామ సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యంపై దృష్టి సారించి ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అందుబాటులో గడ్డి జొన్నలు

పెనగలూరు : రైతులకు గడ్డిజొన్నలు అందుబాటులో ఉన్నాయని పశువైద్యశాఖ అధికారి వేదవతి అన్నారు. పెనగలూరు, కాకర్లవారిపల్లి పశువైద్యశాలలో ఒకటిన్నర టన్ను గడ్డి జొన్నలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఐదు కేజీల ప్యాకెట్టు సబ్సిడీ పోను రైతులకు రూ.115లకే పంపిణీ చేస్తున్నామన్నారు. గడ్డిజొన్నలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబరుతో పశువైద్యశాలకు రావాలని ఆమె కోరారు.

'ప్రేరణ'కు విద్యార్థిని ఎంపిక

ఓబులవారిపల్లి (రైల్వేకోడూరు అర్బన్) : గుజరాత్ వాద్‌నగర్‌లో ప్రధాని మోడీ చదివిన పాఠశాలలో ఏడు రోజులు జరిగిన శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ప్రేరణ కార్యక్రమానికి ఎంపికైన ఓబులవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని గీతికా రెడ్డిని మంగళవారం ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉచిత ఆధార్ క్యాంపులు

పుల్లంపేట : కామన్ సర్వీస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సున్నా నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఉచితంగా ఆధార్ సేవలు అందించడం జరుగుతుందని పుల్లంపేట కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు సురేష్ తెలిపారు. మంగళవారం పుల్లంపేటలోని మెయిన్ రోడ్డులోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఈ సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సిబ్బంది శ్రీలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో మంగళవారం నుంచి జరుగుతున్న ప్రత్యేక ఆధార్ సర్వీస్ క్యాంపునకు స్పందన లభించింది. మొదటి రోజే 45 మంది క్యాంపును సద్వినియోగం చేసుకున్నారు. నూతన ఆధార్ కార్డులు 11, బయోమెట్రిక్ అప్‌డేట్ 4, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ 17, మాండెటరీ బయో మెట్రిక్ (5–7), మాండెటరీ బయో మెట్రిక్ (రూ.100)4, బయోమెట్రిక్ (రూ.100)5గా ప్రజలు సర్వీసులు ఉపయోగించుకున్నారు.


దేశానికి మనమేమిస్తున్నామనేదే ఆలోచించాలి

రాజంపేట టౌన్ : స్వాతంత్ర్య సమరయోధులైన బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లు దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించిన మహనీయులని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ బాలగంగాధర్‌తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల పోరాట స్ఫూర్తి నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశం నాకేమిచ్చింది అని కాకుండా ఈ దేశానికి మనమేమిస్తున్నామని యువత ఆలోచించాలన్నారు. యువత తమ దేశాభివృద్ధికి తమ మేధస్సును ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.హరిప్రసాద్, వీవీ రమణ, జీకే నాగరాజు, పెనుగొండ రమణ, పి.సూర్యచంద్ర, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను సమానంగా చూడాలి

రాయచోటి అర్బన్ : తల్లితండ్రులు తమ పిల్లలను లింగ భేదం లేకుండా సమానంగా చూడాలని డిప్యూటీ డెమో దేవశిరోమణి అన్నారు. రాయచోటి రూరల్ మండలం శిబ్యాల గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో 'ఆడబిడ్డను కాపాడుకుందాం – చదివించుకుందాం' అంశంపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ ఇరువురు సమానమన్నారు. ఆడ పిల్లలను నిర్లక్ష్యం చేస్తూ తల్లి గర్భంలోనే చంపుకుంటూ పోతే సమాజం అమ్మలేని అనాథగా మారుతుందన్నారు. ఆడపిల్లలు కూడా చదువుతోపాటు అన్ని రంగాలలో ప్రోత్సహిస్తే ఆడపిల్లలు రాణిస్తారన్నారు. పారా మెడికల్ ఆఫీసర్ రవికుమార్ నాయక్ మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాలు, వ్యాపించే విధానం, చికిత్సలపై అవగాహన కల్పించారు. కుష్టువ్యాధికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్సను అందిస్తారంటూ తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున అందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థినుల శరీరంపై ఏమైనా కుష్టుమచ్చలు ఉన్నాయా? అని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త విశ్వనాథరెడ్డి, వైద్యసిబ్బంది, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలి



శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

సిద్దవటం: ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని డీఈఓ అనూరాధ సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో జరిగే శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, బోధన సిబ్బందిని ప్రశ్నించారు. విధులకు గైర్హాజరైన సిబ్బంది సెలవులను యాప్‌లో అప్రూవల్ చేసింది, లేనిది పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత మీద ఎక్కువగా దృష్టి సారించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సుండుపల్లె : మండల పరిధిలోని సెక్టార్ – 2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా ప్రాజెక్టు అధికారిణి డి.శశికళ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు ఎదుగుదలకు చేపట్టాల్సిన విధానాలు, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన సలహాల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయకురాళ్లకు సూచనలు చేశారు. 3 – 6 సంవత్సరంలోపు చిన్న పిల్లలు అంగన్‌వాడీ స్కూళ్లకు రావాలని తెలియజేశారు.

రెవెన్యూ కార్యాలయం పరిశీలన

పెనగలూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి పెనగలూరు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్‌తో కలిసి పరిశీలించారు. తహసీల్దార్‌తో కలిసి కార్యాలయంలో ఉన్న రికార్డు రూము, కంప్యూటర్ రూమ్, తహసీల్దార్ రూమ్‌ను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ రాత్రి వేళల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వాచ్ మెన్‌లను నియమించుకోవాలన్నారు. పోలీసుల పర్యవేక్షణ కూడా ఉంటుందని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

లక్కిరెడ్డిపల్లి : నవ్యాంధ్ర బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక నవ్యాంధ్ర బలిజ సంఘం వ్యవస్థాపకులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సంఘం మండల అధ్యక్షులుగా కావలి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా గోవింద్ శ్రీకాంత్, సంఘం సలహాదారుడుగా యనమల మదన్‌మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంటా వెంకటకృష్ణయ్య, కోశాధికారిగా యనమల విశ్వనాథ్, గౌరవ అధ్యక్షులుగా కడియాల వెంకటసూర్యప్రసాద్, మచ్చ రెడ్డన్న, దొంతు రవిశంకర్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మురికినాటి రెడ్డయ్య, నాగుబోతు భాస్కర్, రాజ, కటవమీది ఆంజనేయులు, కార్యదర్శులుగా మురికినాటి వేణు, చిన్నకొండు భాస్కర్, గంగిశెట్టి, శివరాంలను ఎన్నుకున్నారు.

ముద్దవ్యాధి నివారణకు టీకాలు

చిట్వేలి : ముద్దవ్యాధి నివారణకు ముమ్మరంగా టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చిట్వేలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కేడీ ప్రసాద్ తెలియజేశారు. మంగళవారం మండలంలో డాక్టర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఆరుగురు సిబ్బంది నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెల్ల పశువులకు మాత్రమే సంక్రమించే ఈ ప్రాణాంతకమైన ముద్ద చర్మ వ్యాధి నుంచి రైతులను రక్షించాలనే ఉద్దేశంతో ముద్ద వ్యాధి నివారణ చర్యలు చేపట్టినట్లు ఏడీ కేడీ ప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శీతల గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ జాతర మహోత్సవ కార్యక్రమం బుధవారం నుంచి జరుగునని దేవస్థానం కమిటీ వారు మంగళవారం తెలిపారు. జాతరను పురస్కరించుకొని అమ్మవారి గుడిని అలంకరించారు. బుధవారం అమ్మవారికి పాలాభిషేకం, అలంకరణ, పొంగళ్లు, శక్తి పూజ వంటి కార్యక్రమాలు చేస్తామన్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేస్తామన్నారు. రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా గుడికి తీసుకొస్తామని చెప్పారు. గురువారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అమ్మవారి దర్శనం, పొంగళ్లు, నైవేద్యం వంటి పూజలు జరుగుతాయన్నారు. సాయంత్ర అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమం చేస్తామని కమిటీ వారు తెలియజేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని వారు కోరారు.



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

శీతల గంగమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఈ సందర్భంగా మాధరవం–1 గ్రామంలో మంగళవారం ఆలయ కమిటీ వారికి, గ్రామంలోని యువతకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ జాతర సందర్భంగా ఎక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి గొడవలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లాత్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మృతి



సనిశెట్టి నారాయణ (ఫైల్)

రాజంపేట : రాజంపేట క్లాత్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సనిశెట్టి నారాయణ (82) మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు ఆయన మనవడు మున్సిపాలిటీ కౌన్సిలర్ సనిశెట్టి నవీన్ తెలియజేశారు. ఒకటిన్నర దశాబ్దాలుగా వస్త్ర వ్యాపారులకు పెద్దదిక్కుగా ఉంటూ, తనదైనశైలిలో సేవలందించారు. అలాగే ఆర్యవైశ్యసంఘం కార్యదర్శిగా అమ్మవారిశాల అభివృద్ధికి కృషిచేశారు. ఆంజనేయస్వామి ఆలయం పునరుద్ధరణకు తన వంతుగా కృషిచేశారని పలువురు సనిశెట్టి సేవలను గుర్తుచేసుకుంటున్నారు.

నారాయణ సేవలు మరువలేనివి – ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

రాజంపేట క్లాత్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సనిశెట్టి నారాయణ సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవిలు అన్నారు. అమ్మవారిశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. అలాగే పట్టణంలో వస్త్రవ్యాపారుల కోసం ప్రత్యేక అసోసియేషన్ భవనం నిర్మించేందుకు చేసిన సనిశెట్టి కృషి అభినందనీయమని గుర్తుచేసుకున్నారు.

కదిరే కృష్ణపై చర్యలు తీసుకోవాలి

రామాపురం : కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాది కదిరే కృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా విశ్వహిందూ పరిషత్ సంయోజక్ వీరారెడ్డి, భజరంగ్‌దళ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ న్యాయ వృత్తిలో ఉంటూ ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. దీనివల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని, ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కదిరే కృష్ణ క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి దామోదర్‌నాయుడు, మల్‌రెడ్డి రెడ్డప్పరెడ్డి, వెంకటరమణ, వీహెచ్‌పీ సభ్యులు మల్‌రెడ్డి, జయరాంరెడ్డి, వెంకటేష్, పూజారి గంగాధర్‌నాయుడులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు